క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 17న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. రెడ్డి కాలనీ, పాలజెండా, బుద్ధ భవన్, కుమార్‌పల్లి, బాలసముద్రం, సాయినగర్, కంచరకుంట, సాయిబాబా దేవాలయం, ఈద్గా, లష్కర్ బజార్, సిక్‌వాడ, వీపీ రోడ్డు, రియా ఆస్పత్రి, ములుగు క్రాస్ రోడ్డు, అజరా ఆస్పత్రి, న్యూ భద్రకాళి టెంపుల్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వడ్డేపల్లి, సోమిడి, వెస్ట్‌సిటీ సబ్ స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, టేకుల గూడెం సబ్‌స్టేషన్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు తెలిపారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. శంభునిపేట సబ్ స్టేషన్ పరిధి, ఓ సిటీ, ఎస్ఆర్ నగర్, క్రిస్టియన్ కాలనీ, గాంధీనగర్, ఎల్బీసీ కార్యాలయం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

కేడీసీ ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్



విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కేడీసీ) ఫుల్ అడిషనల్ చార్జ్ (ఎఫ్ఏసీ) ప్రిన్సిపాల్‌గా వరంగల్‌లోని రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. కేడీసీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించిన డాక్టర్ రాజారెడ్డి గత నెల 30న ఉద్యోగ విరమణ పొందారు. ఈక్రమంలో కేడీసీలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రజనీలతకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. 15రోజుల అనంతరం రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కు కేడీసీ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా పూర్తి బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను కళాశాల స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎం.రవికుమార్, జీసీజీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.చిన్నా, కేయూ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.వెంకన్న, బాధ్యులు డి.సమ్మయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శ్రీనాథ్, పరీక్షల నియంత్రణాధికారి శివనాగ శ్రీను, అధ్యాపకులు సన్మానించారు.

సైన్స్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా వెంకట్రామ్‌రెడ్డి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని తెలంగాణ అకడమీ ఆఫ్ సైన్సెస్ సంయుక్తంగా ఆగస్టులో నిర్వహించనున్న తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ – 2025కు ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బి.వెంకట్రామ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆగస్టులో మూడు రోజులపాటు తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు.

కళాకారిణి ఆరాధ్యరెడ్డికి సీసీఆర్టీ స్కాలర్‌షిప్



హన్మకొండ కల్చరల్: నగరానికి చెందిన జక్క ఆరాధ్యరెడ్డి కూచిపూడి విభాగంలో సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్) స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. శ్రీసద్గురు శివానంద నృత్యమాల నృత్య గురువు బొంపల్లి సుధీర్‌రావు ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతున్నారు. స్కాలర్‌షిప్‌నకు ఎంపిక కావడంపై ఆరాధ్యరెడ్డిని సుధీర్‌రావు శుక్రవారం అభినందించారు.

ఏసీపీ ప్రశాంత్‌రెడ్డికి సన్మానం



హన్మకొండ అర్బన్: ఇటీవల కాజీపేట ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన పింగిలి ప్రశాంత్‌రెడ్డిని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పలువురు నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి, హనుమకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పత్తి సంపత్‌రెడ్డి, పోస్టల్ కాలనీ అధ్యక్షుడు నల్ల రాజిరెడ్డి, వీసం రమణారెడ్డి, సురేందర్‌రెడ్డి, గంగిడి ప్రభాకర్‌రెడ్డి, చాడ జైహింద్‌రెడ్డి, విజయప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి హామీ’లో అక్రమాలు

- నాలుగురోజులు పనికి వెళ్తే.. రెండు రోజులే హాజరు
- బోగస్ మస్టర్లు సృష్టించి డబ్బు కాజేత
- పని ప్రదేశంలో వసతులు కరువు



అన్నాసాగరంలో పనులు చేస్తున్న కూలీలు

హసన్‌పర్తి: గ్రామాల్లో వలస కూలీలకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం పక్కదారి పడుతోంది. క్షేత్రస్థాయిలో పనులు చేపట్టకపోయినా మాముళ్లు అందితే చాలు మమ అనిపిస్తున్నారు. అధికారుల ఆకస్మిక తనిఖీలు కరువయ్యాయి. దీంతో అధికారుల పేరు చెప్పుకుని కిందిస్థాయి సిబ్బంది పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు బోగస్ మస్టర్లు సృష్టించి డబ్బులను తమ ఖాతాల్లోకి మళ్లిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆన్‌లైన్‌లోని లోసుగులను ఆసరా చేసుకుని దొంగ మస్టర్లు, బోగస్ హాజరుతో డబ్బులు మింగుతున్నారు. పని ప్రదేశం నుంచి కూలీల ఫొటోలను మస్టర్‌తో కలిపి ఎన్ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉండగా, ఒకచోట నమోదు చేసిన ఫొటోలనే మరో మస్టర్‌కు అనుసంధానం చేసి లాభం పొందుతున్నారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలో అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. నాలుగు రోజులు పనికి వెళ్లితే రెండు రోజులు మాత్రమే హాజరు వేస్తున్నారని కూలీలు ఆరోపిస్తున్నారు.

కొలతలు వేయకుండానే..

అధికారులు ఉపాధి కూలీకి రోజుకు సగటున రూ.307లు కూలి నిర్ణయించారు. చేసిన పనికి కొలతలు వేస్తే తక్కువ కూలి వస్తోంది. కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు పని చేయని వారి పేర్లను మస్టర్లలో ఎక్కిస్తున్నారని స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నారు. అధికారులకు కూడా ఇందులో వాటా ఉందని బహిరంగంగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పనులు జరిగే ప్రాంతాల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం ఓ కారణమని స్థానికులు చెబుతున్నారు. పని ప్రదేశంలో ఎలాంటి వసతులు కల్పించడం లేదని కూలీలు అంటున్నారు. ఎండలోనే పనులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇంటి వద్ద నుంచే నీళ్లు తీసుకెళ్తున్నట్లు చెప్పారు.

పారదర్శకంగా ఉపాధి పనులు

ఉపాధి హామీ పథకం పనులు పారదర్శకంగా జరుగుతున్నాయి. పనుల్లో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదు. కూలీలకు సగటున రోజు రూ.307లు కూలి అందేలా చూస్తున్నాం. నిత్యం పని ప్రదేశాల్లో పనులను పర్యవేక్షిస్తున్నాం.

– విజయలక్ష్మి, ఏపీఓ

పరిసరాల పరిశుభ్రతకు డ్రై డే



మాట్లాడుతున్న సునీల్‌కుమార్

కాజీపేట అర్బన్: డెంగీ, మలేరియా జ్వరాల బారిన పడకుండా, దోమల నివారణకు, పరిసరాల పరిశుభ్రత పాటించేందుకు వారంలో మంగళవారం, శుక్రవారం రెండు రోజులు డ్రై డేగా పాటించాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సునీల్‌కుమార్ సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కడిపికొండ గ్రామంలోని బొడ్రాయి నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జోనల్ మలేరియా అధికారి సునీల్‌కుమార్ మాట్లాడారు. దోమల నివారణ, పరిశరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, డాక్టర్లు టి.మదన్మోహన రావు, మంజుల, నాగయ్య, శ్రీదేవి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా బీరన్న కామరాతి కల్యాణం



నీళ్ల బిందెలతో మహిళల భారీ ప్రదర్శన

హసన్‌పర్తి: గొల్ల, కురుమల ఆరాధ్య దైవమైన బీరన్న కామరాతి కల్యాణోత్సవ కార్యక్రమం హసన్‌పర్తి మండల కేంద్రంలో శుక్రవారం వైభవంగా జరిగింది. కార్యక్రమాన్ని పురస్కరించుకుని మహిళలు నీళ్ల బిందెలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. సుమారు రెండు కిలోమీటర్ల వరకు ప్రదర్శన సాగింది. అనంతరం విగ్రహాలకు నెయ్యి, పూలు, జలంతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా డోలు, ఒగ్గు కళాకారులు, శివసత్తుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని పురస్కరించుకుని కురుమ పెద్ద మనుషులు ఐదిళ్లల్లో జోగు పట్టారు. తొలుత గ్రామంలోని పెద్దమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లి, పోచమ్మ తల్లి, వేంకటేశ్వర స్వామి ఆలయం, శివాలయం, భక్త మార్కండేయ ఆలయాల్లోని విగ్రహాలకు పసుపు, జలం, పాలతో అభిషేకాలు చేశారు. ఈనెల 23 నుంచి వారం రోజుల పాటు బీరన్న స్వామి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద మనుషులు కోరె కుమారస్వామి, మారం సుధాకర్, సంపత్, దాడి రాజు, దాడి చిరంజీవి, కోరె సంపత్, కోరె లక్ష్మణ్, తిరుపతి, నంద అనిల్, సాంబయ్య, సాయికుమార్, మల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు



పంచదారతో అభిషేకం

హన్మకొండ అర్బన్: నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. మూడో రోజు గురువారం ఉదయం గణపతి పూజ, నవగ్రహ మాన్య సూక్తహవనం నిర్వహించి, ఉత్సవమూర్తికి 200 కిలోల పంచదారతో అభిషేకం చేసినట్లు ఆలయ అర్చకుడు ఆరట్ల రామాచార్యులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు భజన కార్యక్రమం నిర్వహించి అనంతరం మాలధారులు, భక్తులకు అన్నదానం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో శ్రీహనుమాన్ దీక్ష సేవా సమితి అధ్యక్షుడు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, సభ్యులు దశరథ్ కుమార్, మాదాసు మొగులయ్య, గంద్రతి సుధాకర్, గంట సత్యం, సీతా సమ్మయ్య, శంకర్, మాలధారులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ తల్లి బోనాలు



పోచమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

హసన్‌పర్తి: ఒకటో డివిజన్ ముచ్చర్లలో పోచమ్మ తల్లి బోనాలు వైభవంగా జరిగాయి. గ్రామంలో బొడ్రాయి పునః ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేళ తాళాల మధ్య బోనాలతో మహిలలు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కమిటీ సభ్యులు పెద్ది ఇంద్రాసేనా రెడ్డి, మదూరి మనోహర్, చల్లా వెంకటేశ్వర్ రెడ్డి, సూర ప్రతాప్, రమేష్, సారయ్య, శ్యామ్, శేషాచలం, యుగంధర్, భిక్షపతి, సదానందం, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 30న గ్లోబల్ మున్నూరుకాపు మహాసభలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నయీంనగర్: ఆగస్టు 30న గ్లోబల్ మున్నూరుకాపు అసోసియేషన్ మహాసభలు జరుగుతాయని తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవయ్య పటేల్ మాట్లాడుతూ ప్రతీ నియోజకవర్గంలో మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలని, అందుకోసం అడ్‌హక్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని కమిటీల ఏర్పాటు అనంతరం రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికలు ఉంటాయని చెప్పారు. సమావేశంలో నాయకులు బండి కుమారస్వామి, శ్రీధర్, పెండెల సంపత్, సారంగపాణి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యార్థుల వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న విద్యార్థులు

న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని మండిబజార్‌లోని మద్రాసి మసీదు వద్ద హనుమకొండ పెద్దమ్మగడ్డలోని బాలుర మైనారిటీ గురుకుల ఒకేషనల్ కళాశాల విద్యార్థులు శుక్రవారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జంగా సతీష్ మాట్లాడుతూ కళాశాలలో ఎంఎల్‌టీ, ఏసీపీ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని చెప్పారు.

మైనారిటీ గురుకులాల్లో చేర్పించండి

మైనారిటీ గురుకులాల్లో విద్యార్థులు చేరి తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని వరంగల్ బాలుర (1) జక్కలొద్ది గురుకుల ప్రిన్సిపాల్ బిక్షపతి కోరారు. ఈమేరకు విద్యార్థులను చేర్పించాలని వరంగల్ శంభునిపేటలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సర్వర్ మొహియొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో నాణ్యమైన విద్య

హసన్‌పర్తి: మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సతీష్ తెలిపారు. మైనారిటీ గురుకులంలో ప్రవేశాల కోసం హసన్‌పర్తి మండల కేంద్రంలో ఇంటింటా కరపత్రాలు పంచుతూ శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సతీష్ మాట్లాడుతూ పెద్దమ్మగడ్డలోని మైనారిటీ గురుకుల విద్యాలయంలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గురుకుల విద్యాలయంలో ప్రవేశం పొందే విద్యార్థికి ఉచిత వసతి, భోజనంతో పాటు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందిస్తామన్నారు. 5నుంచి 9వ తరగతితో పాటు ఇంటర్‌లో ఎంఎల్‌టీ, ఏసీపీ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ అన్నపూర్ణ, స్కూల్ కోఆర్డినేటర్ మురళి, వెల్గెటి రాజు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ వితరణ



రామన్నపేట: నగరానికి చెందిన పేద మహిళ పరవస్తు జ్యోతికి అచ్చంపేటకు చెందిన పెద్ది లక్ష్మికాంత్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన భార్య పవిత్ర, కుమార్తెలు భవ్యశ్రీ, ఆద్య.. కుట్టు మిషన్ అందజేశారు. ఎల్బీనగర్‌లోని మసూం అలీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం డాక్టర్ బీవీఎన్ స్వామి అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ ఫౌండర్ బొగ్గరపు రామకృష్ణ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకయ్య, కమలాకర్, భిక్షపతి, శ్రీధరాచార్యులు, కిషన్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కాజీపేట అర్బన్: సైబర్ నేరాలపై హనుమకొండ జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలోని వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో బన్ను ఆరోగ్య సేవా సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్బీజీ ఇండియా హైదరాబాద్, రాష్ట్ర కోఆర్డినేటర్ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై వయోవృద్ధులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల ఫోన్ కాల్స్‌కు స్పందించకూడదని అన్నారు. సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే హెల్ప్‌లైన్ 1930 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ సంస్థ గోపాలపురం అధ్యక్షుడు దామెర నర్సయ్య, చంద్రమౌళి, చంద్రజిత్ రెడ్డి, యగేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఫీజులు పెంచాలనే ఆలోచన సిగ్గుచేటు

హన్మకొండ: రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజులు పెంచాలని ఆలోచించడం సిగ్గుచేటని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున విమర్శించారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజులు పెంచకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. బీ కేటగిరీ సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలని సూచించారు. అధిక ఫీజుల పెంపుతో పేద విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య అందకుండా పోతుందని పేర్కొన్నారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలి

హన్మకొండ: సీపీఐ హనుమకొండ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ నేత నేదునూరి రాజమౌళి పిలుపునిచ్చారు. ఈ మేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మహాసభల కరపత్రాలను నాయకులు శుక్రవారం విడదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26న వేలాది మందితో మహా ప్రదర్శన నిర్వహించనున్నట్లు వివరించారు. 27న ప్రతినిధుల సమావేశం ఉంటుందని అన్నారు. హసన్‌పర్తిలోని శుభం గార్డెన్‌లో జరగనున్న ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

యువజన సంఘం అధ్యక్షుడిగా ప్రవీణ్ కుమార్

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ అంబేడ్కర్ నగర్ కాలనీలో అంబేడ్కర్ యువజన సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా జన్ను ప్రవీణ్ కుమార్ శుక్రవారం ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా నల్ల వెంకటస్వామి, కోశాధికారిగా శివగల్ల సుందర్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో రూ.3 లక్షలు చోరీ

ఖిలా వరంగల్: వరంగల్ ఏనుమాముల ప్రాంతం లక్ష్మీగణపతి కాలనీకి చెందిన తుప్పరి కరుణాకర్ ఇంట్లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి తెగబడ్డారు. ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా తన చెల్లి ఇంటికి వెళ్లి శుక్రవారం ఉదయాన్నే ఇంటికి వచ్చి చూడగా మెయిన్ తలుపు తాళం ధ్వంసం చేసి ఉండడాన్ని గుర్తించాడు. బీరువాలోని రూ.3లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేయగా, క్లూస్ టీమ్‌తో కలిసి ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధి చింతల్ బ్రిడ్జి వద్ద ఓ యువతి అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. గీసుకొండ మండల కేంద్రానికి చెందిన చినగారి వనమ్మకు కుమార్తె సుప్రజ ఈనెల 12న ఉదయం గాడిపెల్లిలోని అమ్మమ్మ ఇంటి వెళ్తానని వచ్చి చింతల్ బ్రిడ్జి వద్ద అదృశ్యమైంది. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

కారు ఢీ.. గాడిద మృతి

ఖిలా వరంగల్: రోడ్డు దాటుతున్న గాడిదను కారు అతివేగంగా ఢీ కొట్టడంతో అది అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం వెంక్రటామ జంక్షన్‌లో జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం వివరించారు.

పండ్ల రసంతో శ్వేతార్కుడికి అభిషేకం



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో మామిడి పండ్ల రసంతో గణనాథుడికి అర్చకులు శుక్రవారం అభిషేకం నిర్వహించారు. సంకటహర చతుర్థి వేడుకలను పురస్కరించుకుని ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయిన వోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో భక్తులు సమర్పించిన మామిడి పండ్ల రసంతో అభిషేకం చేశారు. అలాగే, సాయికృష్ణ శర్మ వరుణ హోమం జరిపించారు. తీర్థ ప్రసాదాల వితరణ అనంతరం అన్నపూర్ణ భవనంలో భక్తులకు అన్నదానం చేశారు.

జూలై 9కి సార్వత్రిక సమ్మె వాయిదా

- 20నుంచి నిరసన కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

ఖిలా వరంగల్: ఈనెల 20న జరగాల్సిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జూలై 9కి వాయిదా వేస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి పాశం రవి, బీఆర్టీయూ జిల్లా నేత యాకూబ్, ఏఐసీసీటీయూ జిల్లా కార్యదర్శి అకెనపల్లి యాదగిరి తెలిపారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో కందిక చెన్న కేశవులు, మాలోతు సాగర్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మే 20 నుంచి జూన్ 9వ తేదీ వరకు నిరంతరం నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎండీ.యాకూబ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

న్యూశాయంపేట: ఈనెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్ జూలై 9వ తేదీకి వాయిదా పడినట్లు బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు ఓ ప్రకటనలో తెలిపారు. జమ్మూకశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాలపై కేంద్ర కార్మిక సంఘాలు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నాయని పేర్కొన్నారు.

అంతరాలు లేని సమాజమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న మేకల రవి

ఖిలా వరంగల్: అంతరాలు లేని సమాజమే ధ్యేయమని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. ఈమేరకు వరంగల్ ఆర్టీఏ జంక్షన్ గణపతి నగర్ కాలనీలో సీహెచ్.శ్రీనివాస్ అధ్యక్షతన ఆ కాలనీ రెండవ మహాసభ శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా రవి మాట్లాడుతూ జిల్లాలో భారీ పరిశ్రమల ఏర్పాటు, ఇళ్ల స్థలాలు ఉన్నవారికి పక్కా ఇళ్లు నిర్మించేందుకు కృషి చేయాలని కోరారు. యువతకు ఉపాధి అవకాశాలు చూపించాలని, ప్రభుత్వం నాణ్యమైన విద్య, వైద్యం అందించాలని సూచించారు. నగరంలో పకడ్బందీ డ్రైయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాష్‌మియా, పనాస ప్రసాద్, మండల కార్యదర్శి దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, ఓర్సు రాజు, జాన్‌పాల్, సువర్ణ, ఎండీ.యాకూబ్, ఆడెపు లలిత, వంశీ, చిరంజీవి, జన్ను రాజు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ పుల్లా శ్రీనివాస్, బాధ్యులు కోరారు. ఈమేరకు కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ, శ్రీనివాస్ మాట్లాడుతూ డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్ల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. 2010, 2023 పీఆర్సీలను వర్సిటీ బోధన, బోధనేతర ఉద్యోగులకు అమలు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, అడ్వాన్స్ శాలరీ, బేసిక్ పే, అదనపు డ్యూటీ, అలెవెన్స్‌లు చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం బాధ్యులు నమిండ్ల కిరణ్‌కుమార్, రవికుమార్, దయాకర్, బొక్క మొగిలి, భాస్కర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యం కోసం పోరాడుదాం



నివాళులర్పిస్తున్న నరేందర్, తదితరులు

- ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్

కాజీపేట అర్బన్: కుల, వర్గ నిర్మూలన జమిలి పోరాటయోధుడు, ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుడు మారోజు వీరన్న స్ఫూర్తితో బహుజన రాజ్యాన్ని సాదిద్దామని ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. మారోజు వీరన్న 26వ వర్ధంతి సందర్భంగా హనుమకొండ అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ వీరన్న ఆశయాలు నేటి తరానికి, బహుజన ఉద్యమాలకు ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో తాడిశెట్టి క్రాంతికుమార్, అప్పారావు, రాజిరెడ్డి, చాపర్తి కుమార్, ఓదయ్య, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ మృతుడి కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న రవీందర్ రెడ్డి

వరంగల్ చౌరస్తా: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఈనెల 9న విధులు నిర్వహిస్తూ వడదెబ్బతో శివరాత్రి శ్రీను మృతి చెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులకు మార్కెట్ ఆవరణలో చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు రూ.11 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయినందున వ్యవసాయ మార్కెట్ నుంచి చట్టపరంగా రావాల్సిన పరిహారాలను అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో చాంబర్ కోశాధికారి అల్లె సంపత్, సంయుక్త కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు ఎస్‌రెడ్డి లింగారెడ్డి, ఉపాధ్యక్షులు సూర రమేష్, చిల్లీస్ సెక్షన్ కార్యదర్శి లోలాకపురి సురేందర్, గుమస్తా సంఘం అధ్యక్షుడు ఇనుముల మల్లేశం, కార్యదర్శి సులగం గోపాల్, వివిధ హమాలీ కార్మిక సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.